
సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



ఆవుదూడకు పూజలు చేస్తున్న వివేకానంద స్వచ్ఛంద సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో గోమాతకి(సురభి) ప్రత్యేక పూజలు జరిపారు. దూడ జన్మించి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆవు, దూడకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ హిందూ ధర్మాచారం ప్రకారం గోమాత అంటే లక్ష్మీదేవి అని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఈ దూడ జన్మించడం అదృష్టంగా భావించి ప్రత్యేక పూజలు జరిపినట్టు తెలిపారు. గోమాత పేరిట అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సంస్థ మహిళా సభ్యులు నాగమణి, సుజాత, అచ్యుత, ఉమాదేవి, రమాప్రియ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



అవంతికి బీమా సాయం అందజేస్తున్న రాము, రమేష్ తదితరులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు, అల్లిపురం, మిరపకాయలవీధిలో నివసిస్తున్న ఉసిరికల రామకోటి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అతని భార్య ఉసిరికల అవంతికి వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరిపల్లి రాము, ఎం.రమేష్ సచివాలయం అడ్మిన్ భార్గవ్‌తో కలిసి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ కుటుంబం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

మూడు రోజుల పాటు కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్ : ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేయనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ ఈ శిబిరంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్లవ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉండి చికిత్స అందజేయనున్నారని చెప్పారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు 7675861446/0891–2568264 నంబర్లలో సంప్రదించవచ్చు.

శివోహం

- శివరాత్రి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలతో అంతటా ఆధ్యాత్మిక సౌరభం

శివరాత్రి రోజునే శివుడు లింగరూపంలో ఉద్భవించాడని పురాణాల వల్ల తెలుస్తోంది. అమితమైన దైవశక్తి గురించి తెలిపేందుకే ఈ అవతారం అంటారు రుషులు. అనంతమైన లింగాకారంలో ఉన్న శివుడు తాను సర్వవ్యాపితమని నిరూపించాడు. తనపై మనసు నిలిపి ధ్యానిస్తే ఎక్కడైనా తాను కనిపిస్తానని చెప్పేందుకు ఆయన లింగాకారం ధరించినట్లు చెబుతారు. శివరాత్రి రోజు అర్ధరాత్రి సమయంలోనే లింగోద్భవం జరిగింది కనుక ఆ సమయంలో శివుని ఆరాధిస్తే పుణ్యఫలం దక్కుతుంది.



ఎరుకుమాంబ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న చైర్మన్, ఈవో



విశ్వవిహార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీ రాజశేఖర్



దొండపర్తిలో కాళీమాత నృత్యం చేస్తున్న కళాకారులు



పోలీస్ బ్యారెక్స్ శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు

డాబాగార్డెన్స్ : పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మహా శివరాత్రి వేడుకలు నియోజకవర్గంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేకువ జాము నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్వామి మమ్మల్ని కరుణించి.. కాపాడాలంటూ భక్తిశ్రద్ధలతో పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులు తరించారు. రోజంతా ఉపవాసాలతో గడిపారు. రాత్రి జాగారంతో శివనామ స్మరణ చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు పంచాక్షరీ మంత్ర ప్రతిధ్వనులతో మార్మోగాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవకాలం వరకు రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పరమశివుని దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయంలో వేకువ జాము నుంచే పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. సింగ్ హోటల్ జంక్షన్ శివాలయం వీధిలో ఉన్న ఓంకార ఆలయంలో ప్రాతఃకాలం నుంచే ఓంకారేశ్వర స్వామికి అభిషేకాలు జరిపారు. రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఏవీఎస్ కాలేజీలో ఉన్న శివాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, పోలీస్ క్వార్టర్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, వన్‌టౌన్ భీమాశంకరాలయం, గొల్లలపాలెంలో గల శివాలయం, పెరికివీధిలో గల శివాలయం, అస్సాం గార్డెన్స్‌లో గల శివరామకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బురుజుపేటలో గల భావన ఋషి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు.

ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ చేయాలి..

ప్రతి ఒక్కరూ భగవన్నామస్మరణ చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పేర్కొన్నారు. సత్యానంద మహర్షి నెలకొల్పిన సత్యానంద విశ్వ విహార్‌లో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పరమేశ్వరునికి అభిషేకం నిర్వహించి, మహా మృత్యుంజయ హోమం జరిపారు. అనంతరం భగవన్నామస్మరణ విశిష్టతపై ఎంవీ రాజశేఖర్ ప్రవచనం చేశారు. భగవన్నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో భగవన్నామ స్మరణకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. సంకీర్తనలతో భగవంతుని స్మరిస్తూ ఎందరో వాగ్గేయకారులు దైవానుగ్రహం, దైవదర్శనం పొందారని తెలిపారు. కార్యక్రమంలో సత్యానంద విశ్వ విహార్ మాతా సునంద శ్రీనివాస, ఆశ్రమ ప్రతినిధులు బీవీఎస్ సత్యనారాయణ, బి. లక్ష్మణస్వామి, దాసు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో..

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శనాలు చేసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పుర వీధుల్లో సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. కాళీమాత నృత్యం, పులివేషాలు, సన్నాయి మేళం, సేవా గరిడి, డప్పులు, కాంగో, తప్పిటగుళ్లు, తీన్‌మార్, కోలాటంతో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. దొండపర్తి, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. భక్తులు భారీగా చేరుకున్నారు. ఆలాగే ఎలాంటి అల్లర్లు జరగకుండా ఫోర్త్ టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో రమాబాయి, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ అధికారులు, ట్రస్టు సభ్యులు పిల్లి స్వాతి, పి.లక్ష్మీనారాయణమ్మ, పిల్లిదుర్గ, పెద్దాడ రమణమ్మ, దళాయి అన్నపూర్ణ, కె.బ్రహ్మాజీ, బి.సూర్యనారాయణ, సరగడ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠునికి ప్రత్యేక పూజలు..

అల్లిపురం : శివరాత్రి సందర్భంగా శుక్రవారం డీబీకే రైల్వే క్వార్టర్స్‌లోని భవానీ శంకర దేవాలయం, మురళీధర వీధి పంచాయతన పంచముఖేశ్వర దేవాలయం, బౌడారారోడ్డు ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం, వెంకటేశ్వరమెట్ట శివాలయం వద్ద నీలకంఠుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, లింగోద్భవ కాలంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా ఈ నెల 16, 17 తేదీలలో జరిగే అమ్మవారి ఉత్సవాల బ్రోచర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం శుభప్రద హోల్డింగ్స్ యాజమాన్యం సహకారంతో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, వాసుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో జీకే ఫౌండేషన్ వద్ద ఏర్పాటు చేసిన శివలింగం సెట్



విశేష అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామి



రేణుక యల్లమ్మ ఆలయం ప్రాంగణంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

వైభవంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర



విశేష అలంకరణలో నీలమ్మవేపచెట్టు అమ్మవారి ఉత్సవ విగ్రహం



విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర మహాస్వామి ఆశీస్సులందుకుంటున్న బోర విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు జోగారావుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారు జామున క్షీరాభిషేకం, కుంకుమాభిషేకం నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు స్వయంగా చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత. చిన్నారులను అమ్మవారి ఆశీస్సుల కోసం అమ్మవారి ఒడిలో వేసి దీవెనలు తీసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారిని శారదాపీఠం పీఠాధిపతులు స్వరూపానందేంద్రస్వామి, స్వాత్మానందేంద్రస్వామి దర్శించుకుని పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బోరా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, ఈవో జీవీ రమాబాయి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసన్న లక్ష్మీ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరవారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీ వత్సవ్ తదితరులు దర్శించుకున్నారు.

దుర్గాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- ఘనంగా వార్షిక జాతర మహోత్సవం



అమ్మవారిని తోడ్కొని వస్తున్న భక్తులు



ఉత్సవంలో సింహాద్రి అప్పన్న సందడి



ఉత్సవంలో అష్ట దుర్గలు

డాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు తలపై పసుపు నీళ్ల బిందెలు పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అభిషేకించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర ఉత్సవం శనివారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు ఈవో పేర్కొన్నారు. 16న మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) నివేదన చేయనున్నారు.

సందడే సందడి..

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్లుపాకలు, దుర్గాలమ్మ గుడి ఏరియా, వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, పెరికివీధి, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కలశాలు, పూల ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో పులులు, దశావతారాల్లో దుర్గమ్మ, సింహాద్రి అప్పన్న, కోలాటం, అష్టదుర్గలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు భవానీలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా రాత్రి 9 గంటల నుంచి పలు వీధుల్లో ఆర్కెస్ట్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశాయి.



శూలాలతో భక్తులు



పులివేషధారులతో దద్దరిల్లిన దుర్గాలమ్మ ఆలయ ప్రాంతం



దుర్గమ్మ దశావతారాల ప్రదర్శన

అమ్మకు సముచిత గౌరవం



సిబ్బందిని సత్కరిస్తున్న ప్రగడ వాసు



మహిళకు కేక్ తినిపిస్తున్న సింహాచలం

అల్లిపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ షెల్టర్ ఉద్యోగులు జ్యోతిర్మయి, లీలావతి, కుమారి, ధనలక్ష్మి, సీతారత్నం, శాంతి, అనితలను కార్యదర్శి ప్రగడ వాసు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వుమెన్ షెల్టర్ ద్వారా రోడ్లపై మగ్గిపోతున్న 596 మంది ఒంటరి మహిళలు, మానసిక రోగులు, వృద్ధ మహిళలను చేరదీసి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి చేసిన కృషిని అభినందించారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం..

జగదాంబ : వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శుక్రవారం లక్ష్మీ టాకీస్ జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను ఘనంగా సన్మానించారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రాధాన్యతనిచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయా వార్డుల వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



కేక్ కట్ చేస్తున్న స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి

విశాఖ సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపించగలరని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీస్ శాఖ కుటుంబ సలహా నివేదిక', 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–పోలీసు శాఖ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకు నోటీసు'అనే పుస్తకాలను విడుదల చేశారు. సీపీ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని, మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజాగ్ సిటీ పోలీస్ మహిళా కో–ఆపరేటివ్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖలో ప్రతిభ కనబరిచిన 26 మంది మహిళా పోలీసులకు సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎస్.మణికంఠ చందోలు, డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం, ప్రాసిక్యూషన్స్ డీడీ ఎం.శైలజ, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ చేయూత' పంపిణీ

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శనివారం వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రభాకర్ తెలిపారు. భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేయూత మెగా చెక్కును మహిళలకు అందజేయనున్నారన్నారు. మండలంలో చేయూత పథకం కింద నాలుగో విడత 3,963 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున మొత్తం రూ.7.43 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు.

హెచ్‌పీసీఎల్‌లో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. సంస్థలో పైప్‌లైన్ నుంచి స్టీమ్ ఫోర్స్‌గా రావడంతో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రమోద్ సింగ్, షాయిద్ మైతీ ఉపాధి నిమిత్తం గతేడాది మల్కాపురం వచ్చారు. హెచ్‌పీసీఎల్‌లోని సీఆర్–3 అనే సంస్థలో ప్రమోద్‌సింగ్ ఫోర్‌మన్‌గా, షాయిద్ మైతీ రిగ్గర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంస్థ ఆవరణలో డీహెచ్ఎస్‌పీఎఫ్ఆర్‌యూ ప్లాంట్ యూనిట్‌లో కొన్ని రోజుల నుంచి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ యూనిట్‌లోని పైపుల్లో చమురు వంటి మడ్డి వంటి పదార్థాలు నిలిచిపోయాయి. దీంతో స్టీమ్‌ను ఆ పైపుల్లోకి ఎక్కించి, ఆ స్టీమ్ ద్వారా మడ్డిని బయటకు తీస్తున్నారు. ఐదు రోజులుగా ఈ పనులు జరుగుతుండగా.. శుక్రవారం ప్రమోద్‌సింగ్, షాయిద్ మైతీ ఈ పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో పైపుల్లోని స్టీమ్ ఫోర్స్‌గా ఒక్కసారి బయటకు రావడంతో అక్కడ ఉన్న ప్రమోద్, మైతీ గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని సంస్థ అంబులెన్స్‌లో నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ మోజెస్ పాల్, మల్కాపురం సీఐ సన్యాసినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. క్షతగాత్రుల వివరాలు సేకరించారు. కేసును మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ సభ్యురాలు పద్మ

సీతమ్మధార : మహిళలు పని ప్రదేశాల్లో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ సభ్యులు జీవీఎల్ పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువులన్నట్లు పని ప్రదేశాల్లో కొందరు వేధింపులకు గురిచేస్తున్నారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించాలని, మహిళల కోసం చట్టాలు చేస్తున్నారే తప్ప వాటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఇటువంటి వాటిని ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేన్ సభ్యులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు కిట్ల పంపిణీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ క్రీడాకారులకు శుక్రవారం కిట్లు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఆల్ ఇండియా స్టీల్‌ప్లాంట్ల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో స్టీల్ ప్లాంట్‌కు చెందిన యువ బాక్సర్లు ఎస్.నరేంద్ర కుమార్, ఎం.దిలేష్, కె. సాయి లోహిత్ సబ్ జూనియర్ కేటగిరీలో పాల్గొంటుండగా ఎం.లిఖిత్ కుమార్, ఎస్.రాంచరణ్ కుమా ర్, కె. దేవి శ్రీప్రసాద్ జూనియర్ కేటగిరీలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ విభాగంలో జరిగి న కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, కోచ్ కె.శ్రీనివాసరావు, మేనేజర్ బి.రామారావు, టెక్నికల్ ఆఫీషియల్ ఎస్.వి.శర్మ చేతుల మీదుగా క్రీడాకారులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం అధికారులు అమిత్ ఘడాయ్, కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజున స్కూళ్ల నిర్వహణపై సీరియస్

విశాఖవిద్య: శివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించినా.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిర్వహించడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించిన పాఠశాలల వివరాలను అందజేయాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పిల్లలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే శివరాత్రి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ.. కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు తరగతులు నిర్వహించినట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధారాలతో కమిషన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీన్ని సుమోటోగా స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com